రైతులకు తప్పని పడిగాపులు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

యూరియా కోసం రైతులు ఎగబడ్డారు. పట్టణ పరిధిలో మూడు ప్రయివేటు పురుగు మందుల దుకాణాలకు యూరియా రావడంతో పెద్ద ఎత్తున రైతులు ఆయా దుకాణాలకు చేరుకున్నారు. పోలీసుల బందోబస్తు మధ్య రైతులకు బయోమెట్రిక్ ద్వారా యూరియాని సరఫరా చేశారు. మండల వ్యవసాయ శాఖ అధికారి కెవివి.సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు అవసరం మేరకు యూరియాని ఉపయోగించుకోవాలని సూచించారు.

క్యూలో పడిగాపులు పడుతున్న రైతులు

అన్నదాతపై తెగుళ్ల దాడి

-సుడి, పాడ, కాండం కుళ్లు ఉధృతి
-నివారణకు భారీగా ఖర్చు
-ఎకరానికి రూ.2 వేలకుపైనే అదనపు భారం
-అతలాకుతలమవుతున్న సాగుదారులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

అన్నదాతలు నిత్యం కష్టాల కొలిమిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఆదిలో వర్షాలు లేక, కాలువల ద్వారా సాగునీరు సక్రమంగా అందక వరి పండించే రైతులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. తీరా ఏదోలా నాట్లు వేసిన తర్వాత పంటను సాగు చేసేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. ప్రభుత్వ తీరుతో ఎరువుల అందుబాటులో లేకపోవడంతో రైతుల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నడూ లేనివిధంగా ఈసారి యూరియా కొరత రైతులను వేధిస్తోంది. పంట సక్రమంగా పెరగాలన్నా, ఆశించిన స్థాయిలో దిగుబడి సాధించాలన్నా కచ్చితంగా యూరియా వినియోగం తప్పనిసరి. అయితే ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వలన పూర్తిస్థాయిలో యూరియా అందక కర్షకులు క్యూలు కట్టి మరీ యూరియాను కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా తెగుళ్ల దాడి రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ముప్పేట దాడితో సాగుదారులు పడరాని పాట్లు పడుతున్నారు. అదనపు ఖర్చులు భరించలేక అప్పులు చేస్తున్నారు.

జిల్లాలో సుమారు 2.23 లక్షల ఎకరాల్లో వరి, దాదాపు 70 వేల ఎకరాల్లో పత్తి, ఆపరాలు, ఇతర పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంటలను చీడపీడలు ఆశిస్తున్నాయి. డెల్టాలో రెండు నెలల ముందుగానే నాట్లు పూర్తవగా, మెట్టలో వరి ఇప్పుడిప్పుడే ఏపుగా పెరిగే పరిస్థితిలో ఉంది. ఈ నేపథ్యంలో ఆశించిన స్థాయిలో దిగుబడులు సాధించడం కోసం ఓ పక్క ఎరువులు కోసం తంటాలు పడుతుండగా మరోవైపు తెగుళ్ల దాడి నుంచి రక్షించుకునేందుకు అదనపు భారంతో రైతులు సతమతమవుతున్నారు.

ఎకరాకు 2 వేలు భారం

ప్రస్తుతం అన్నిచోట్లా వరి పంటను రెండు మూడు తెగుళు ఆశించి ఉన్నాయి. సకాలంలో సాగునీరు అందక, అధిక వరద వరదల వలన పంట మొదట్లో కుళ్ళిపోవడం, సక్రమంగా ఎరువులు సరఫరా లేకపోవడం వంటి పలు కారణాల వలన ప్రస్తుతం పంటలపై తెగుళ్ల దాడి ఎక్కువయ్యిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట కాలంలో రెండు మూడుసార్లు మందులను పిచికారీ చేయాల్సి వస్తుండడంతో ఒక్కో ఎకరానికి రూ.1000 నుంచి రూ.2 వేలు వరకు అదనపు భారం పడుతుందంటూ వారు వాపోతున్నారు ప్రధానంగా కాండం కళ్ళు తెగులు వలన నష్టం ఎక్కువగా నష్టం జరుగుతోందంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట పిలకలు చేసే దశ తర్వాత నీటిమట్టం వద్ద ఆకు తొడిమ పైభాగం చిన్న చిన్న నల్లటి మచ్చలు ఏర్పడుతున్నాయి. తెగులు తీవ్రత పెరిగేకొద్దీ ఈ మచ్చలు పెద్దగా అవుతున్నాయి. ఇవి ఆకు తొడిమ లోపలి భాగాల్లోకి చొచ్చుకపోయి గోధుమ రంగుతో కూడిన నల్లటి మచ్చలు ఏర్పడుతున్నాయి. దీని వలన కంకుల్లో తాలు గింజలు ఏర్పడతాయని, దిగుబడిపై ప్రభావం చూపుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పిలకలు చేసే దశ మధ్య నుంచి లేదా వ్యాధి ప్రారంభం అయ్యే సమయంలో హెక్సాకోనిజోల్ 2 మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాల్సి వస్తుందని తెలిపారు. అలాగే పొడ తెగులుతో ఆకుపై భాగంపై నీటి డాగు మచ్చలు ఏర్పడుతున్నాయి. క్రమంగా అవి పెద్దవి అయి ఆకు కాండం పొట్ట, వెన్ను, భాగాలలో ఒక నిర్దిష్ట ఆకారం లేకుండా మచ్చలు ఏర్పడుతున్నాయి. మధ్యలో బూడిద రంగులు ఉండి చుట్టూ ముదురు గోధుమ రంగు అంచులు కలిగి పాము పొడను పోలి వుంటున్నాయి. ఈ తెగులు తీవ్రం అయితే మొక్క ఆకులు ఎండిపోయి భారీగా దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

హెక్సా కొనజోల్ 5 ఇసి మందుని రెండు మిల్లీలీటర్లు లేదా లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాల్సి వస్తుంది. అలాగే పలు చోట్ల సుడి దోమ తెగులు వేధిస్తోందని రైతులు వాపోతున్నారు. ఈ దోమలు వరి దుబ్బుల ద్వారా రసం పేల్చేస్తుండడంతో పైరు ఎండిపోయినట్లుగా కనిపిస్తుంది. దీంతో కూడా నష్టం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ తేమతో కూడిన పొడి వాతావరణం, మోతాదుకు మించి ఎరువులు వాడకం, గట్లు శుభ్రం చేయకపోవడం, దమ్ము సక్రమంగా చేయకపోవడం వంటి కారణాల వలన ఈ తెగులు వ్యాపిస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. తప్పకుండా రైతులు నివారణ చర్యలు తీసుకోవాలని తగిన పురుగుల మందు పిచికారి చేసుకుని జాగ్రత్తలు వహించాలంటూ సూచిస్తున్నారు. తెగుళ్ల నివారణకు మందులను అధిక మొత్తం వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా పురుగుల మందులను సబ్సిడీ ధరలపై పంపిణీ చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న అజశర్మ

దేశానికి కమ్యూనిస్టు సిద్ధాంతమే శరణ్యం

ప్రజాశక్తి - కాకినాడ

భారత దేశానికి, దేశ సకల జనుల సౌభాగ్యానికి కమ్యూనిస్టు సిద్ధాంతమే శరణ్యమని సిపిఎం రాష్ట్ర నాయకులు అజశర్మ అన్నారు. సిపిఎం రాజకీయ శిక్షణా తరగతులు శనివారం స్థానిక సుందరయ్య భవన్లో జరిగాయి. ఈ సందర్భంగా 'భారత కమ్యూనిస్టు పార్టీ -చరిత్ర) అనే అంశంపై ఆయన మాట్లాడారు. బ్రిటిష్ దాస్య సంకెళ్ళ నుంచి భారత్‌ను విముక్తి చేయడానికి, దేశ ప్రజలంతా కుల మతాలకతీతంగా సమైఖ్యంగా కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటయిందని తెలిపారు దేశ స్వాతంత్ర్య సాధనే లక్ష్యంగా నికరంగా పోరాడిన ఘన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదేనని అన్నారు. స్వాతంత్ర్య అనంతరం అనేక ప్రజా ఉద్యమాలు జరిగాయని, ముఖ్యంగా రైతాంగ సాయుధ పోరాటంలో దేశ విచ్ఛిన్నకర ఉగ్రవాదానికి వ్యతిరేకంగా యువజన, విద్యార్థులను సమీకరించి దేశాన్ని ఐక్యంగా నిలపడంలో వేలాది మంది కమ్యూనిస్టులు ప్రాణత్యాగాలు చేశారని వివరించారు. ఎల్లకాలం దేశానికి వ్యతిరేకంగా పనిచేసిన విచ్ఛినకర శక్తులు దేశాధికారాన్ని హస్తగతం చేసుకోవడం దురదృష్టకరమని, దీని ఫలితం నేడు దేశం అనుభవిస్తుందని అన్నారు. మతోన్మాద నయా ఫాసిస్టుల నుంచి దేశాన్ని విముక్తి చేసి దేశ ప్రజలకు స్వేచ్ఛా, ప్రజాస్వామ్యం, ఉపాధి అందించాల్సిన ఆవశ్యకత ఆసన్నమైందని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమ చరిత్ర వారసత్వాన్ని నేటికీ ప్రజా ఉద్యమాలు ద్వారా కొనసాగిస్తున్నది కేవలం కమ్యూనిస్టు పార్టీలు మాత్రమేనని అన్నారు. సిపిఎం దేశ వ్యాప్తంగా జనం కోసం, జనంతో మిలిటెంట్ పోరాటాలు చేస్తూ ప్రజలను ఆదుకోవడమే కాకుండా దేశ ప్రకృతి వనరులను, దేశ సంపదను దేశానికే చెందేందుకు కృషి చేస్తుందనీ వివరించారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం కోసం, మెడికల్ కాలేజీలు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా, అణగారిన తరగతులకు సామాజిక న్యాయం కోసం, ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు కోసం, మహిళా సమస్యలుపై అనేకం నిత్య పోరాటాలు చేస్తుందన్నారు. ప్రజలు, యువతరం కమ్యూనిస్టులను ఆదరించాలని, కులం, మతం పేరుతో విచ్ఛిన్నకర భావజాలానికి లోనుకాకుండా నిత్య చైతన్యంతో అభ్యుదయ భావాలు అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, పార్టీ జిల్లా కమిటి సభ్యులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడులో డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేసిన విద్యా శాఖామంత్రి నారా లోకేష్‌ను ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ కోరారు. ఈ మేరకు శనివారం ఆయనను విజయవాడలో కలిసి నియోజకవర్గంలో నెలకున్న సమస్యలను పరిష్క రించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ప్రత్తిపాడులో డిగ్రీ, జూనియర్ కళాశాలలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు మంత్రికి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె స్థానిక మీడియాకు ఒక ప్రకటనను విడుదల చేశారు. లంపక లోవలో ఉన్న జూనియర్ కళాశాలను పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టి, అధ్యాపకుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఆయన సానుకూలంగా స్పందించారని, ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎంఎల్‌ఎ తెలిపారు.

మంత్రి లోకేష్‌కి వినతిపత్రం అందిస్తున్న ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ

అక్టోబర్ 10న దిశ సమావేశం : కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం (దిశ) అక్టోబర్ 10వ తేదీన కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ఈ సమావేశాన్ని నిర్వహిస్తామని, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు. ఆయా శాఖల అమలు చేస్తున్న వివిధ పథకాలు, అభివృద్ధిపై సమీక్షించడం, అధ్యక్షులచే ప్రతిపాదించిన ఇతర అంశాలను చర్చిస్తామని తెలిపారు.

'11 ఏళ్ల శ్రమ ఫలించింది'

ప్రజాశక్తి - సామర్లకోట

డిఎస్‌సి విజేత సత్తిబాబు

ఉపాధ్యాయుడు అవ్వాలన్న 11 ఏళ్లుగా పడ్డా శ్రమకి తగ్గా ఫలితం నేడు దక్కిందని మండలంలోని చంద్రంపాలెం గ్రామానికి చెందిన డిఎస్‌సి విజేత, అంధుడు కసిరెడ్డి సత్తిబాబు అన్నారు. డిఎస్‌సిలో తెలుగు ఉపాధ్యాయునిగా ఉద్యోగం పొందిన సత్తిబాబును 'ప్రజాశక్తి' పలుక రించింది. తాను పుట్టి గుడ్డివాడిని అయినప్పటికీ, పదేళ్ల క్రితం ఆపరేషన్ వికటించడంతో రెండు కాళ్లు చచ్చు పడిపోయి నడవలేని స్థితికి చేరానన్నారు. తాను ఒకటో తరగతి నుంచి 6వ తరగతి వరకు చంద్రంపాలెంలో, 7 నుంచి 10వ తరగతి వరకు మండపేట బ్లైండ్ స్కూల్లోనూ, ఇంటర్ విద్య మహబూబ్‌నగర్‌లో, 2007 నుంచి 2010 వరకూ తిరుపతిలోని ఎస్‌వి ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసినట్లు తెలిపారు. గూడూరు ఆదిశంకర కళాశాలలో బ్రెయిలీ లిపి ద్వారా 2011లో పూర్తి బిఇడి చేసినట్లు చెప్పారు. తనకు విద్య నేర్పిన గురువుల సలహా మేరకు 2014, 2018లో డిఎస్‌సి పరీక్షలు రాసినా ఫలి తం దక్కలేదన్నారు. 2025లో ప్రస్తుత ప్రభుత్వం ఎక్కువ పోస్టు కేటాయించడంతో 47 మార్కులు సాధించిన తనకు రిజర్వుడు కోటాలో తెలుగు ఉపాధ్యా యునిగా ఉద్యోగం లభించినట్లు చెప్పారు. తన తల్లిదండ్రులు జోగిరాజు, నాగమణి ప్రోత్సాహంతో తాను ఉపాధ్యాయ ఉద్యోగాన్ని సాధించగలిగానని చెప్పాడు. ఒక మనిషి ఎత్తుకొని తీసుకెళ్తే తప్ప నడవలేని దుస్థితిలో ఉన్నప్పటికీ కళ్లురెండు పూర్తిగా పుట్టినప్పటి నుంచి కనిపించినప్పటికీ తన లక్ష్యాన్ని మూడో ప్రయత్నంలో సాధించి తన కల నెరవేర్చుకున్న కసిరెడ్డి సత్తిబాబు వంటి వ్యక్తి జీవితం ఎందరికో ఆదర్శంగా నిలుస్తుందని పలువురు కొనియాడారు.

ప్రభుత్వ లక్ష్య సాధనకు కృషి

ప్రజాశక్తి - సామర్లకోట, కాజులూరు

విద్యారంగంలో ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా డిఎస్‌సి విజేతలు కృషి చేయాలని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శనివారం స్థానిక సామర్లకోట అచ్చంపేటలోని ఎంఎల్‌ఎ కార్యాలయంలో నియోజకవర్గం వ్యాప్తంగా డిఎస్‌సిలో విజేతలుగా నిలిచిన 64 మంది ఎంఎల్‌ఎను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించిందని, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగుపెడుతున్న వారంతా కృషి చేయాలని అన్నారు. ఉపాధ్యాయ విజేతలను చినరాజప్ప అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డివై డిఇఒ ప్రభాకర్ వర్మ, ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, టిడిపి నాయకులు రాజా సూరిబాబురాజు, నూనె రామారావు, బడుగు శ్రీకాంత్, ముసిరెడ్డి శ్రీరాములు, బలుసు వాసు పాల్గొన్నారు. అలాగే కాజులూరు మండలం గొల్లపాలెం జడ్‌పి పాఠశాలలో గొల్లపాలెం గ్రామం నుంచి డిఎస్‌సిలో ఉపాధ్యాయులుగా ఎంపికైన ఏడుగురిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక నూతనంగా ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగపెట్టిన సిహెచ్.శ్రీనివాసరావు, పోతురాజు శ్రీను, వనం తనూజ్‌కుమార్, ఓలేటి మైథిలి, మానబత్తుల శ్రీనుబాబు, పోతురాజు వెంకటేష్‌బాబు, దేగల రవళిలను అభినందించారు. విద్యార్థుల భవిష్యత్‌కు మార్గదర్శకులుగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సునీల్‌కుమార్, ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరి, సొసైటీ అధ్యక్షులు అంగర కృష్ణదీవెన, మెడికల్ వెంకన్నబాబు, స్థానిక నాయకులు తాడి వెంకటరెడ్డి, ఎస్ఎంసి ఛైర్మన్ మురే శివశంకర్ తాతారావు పాల్గొన్నారు.

నియామకపత్రాలతో డిఎస్‌సి విజేతలు

సబ్ జైల్‌ను సందర్శించిన అదనపు జిల్లా జడ్జి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం సబ్ జైల్‌ను 7వ అదనపు జిల్లా జడ్జి జి.చంద్ర మౌళేశ్వరి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ముద్దాయిల యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడంతో పాటు భోజనం, నివాస సౌకర్యాలు, జైలు పరిసరాలను సమీక్షిం చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.శీరమణి, డిఎస్‌పి శ్రీహరిరాజు, పిడబ్ల్యూడి ఇఇ శేషగిరిరావు, వెల్ఫేర్ ఆఫీసర్ వాణి, విద్యా అధికారి ప్రభాకర శర్మ, వ్యవసాయ అధికారి ఎన్. దైవకుమార్, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ ప్రశాంతి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజకుమార్, న్యాయవాది ప్రభుజి, వాలంటీర్ డి.లక్ష్మీ, జైలు సూపరింటెండెంట్ కె.రమణబాబు సిబ్బంది పాల్గొన్నారు.

ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి

ప్రకృతి సాగులో పక్షి స్థావరాల ఏర్పాటు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని గొల్లలగుంట ప్రకృతి సాగు పంటల్లో వ్యవసాయ సహాయ సిబ్బంది శనివారం పక్షి స్థావరాలను ఏర్పాటు చేశారు. ఇలా స్థావరాలను ఏర్పాటు చేయడం ద్వారా పక్షులు వీటిపై ఉంటూ పంటను నాశనం చేసే పురుగులను అరికడతాయని సిబ్బంది పడాల రాజేష్ తెలిపారు. అలాగే పంట పొలాల గట్లపై కంది, బెండ, బొబ్బర్లు విత్తనాలను, బంతి మొక్కలను నాటడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో చిరుకూరి కృష్ణవేణి, రేగల్ల వీర రాఘవ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పక్షి గూళ్లను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

తనిఖీల నివేదికలు అందజేయాలి: డిఆర్ఒ

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలోని హౌసింగ్ కాలనీలపై చేపట్టిన తనిఖీ నివేదికలను డిఆర్ఒ జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మితో కలిసి డిఆర్ఒ హౌసింగ్ కాలనీల తనిఖీ పురోగతిపై పంచాయతీరాజ్, హౌసింగ్, ఆర్డబ్ల్యూఎస్ శాఖల క్షేత్రస్థాయి ఇంజినీర్‌లు, గ్రామీణ ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ వెంకటరావు మాట్లాడుతూ గతంలో ఏర్పాటు చేసిన హౌసింగ్ కాలనీలకు సంబంధించి 300 వర్క్ ఐడిలకు గాను ఇప్పటికి వరకు189 వర్క్ ఐడిలు మాత్రమే నివేదికలు సమర్పించడం జరిగిందన్నారు. అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టి మిగిలిన 111 వర్క్ ఐడీలను అక్టోబర్ 7 నాటికి తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని ఆయన ఆదేశించారు. డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి మాట్లాడుతూ పంచాయతీరాజ్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల సమన్వయంతో పనిచేసి హౌసింగ్ కాలనీల తనిఖీ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు.

అదర్శ్‌లో ముగిసిన సాధన 2కె25

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలులో ఉన్న ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న సాంకేతిక విద్యా ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఎంపి తంగెళ్ళ ఉదయ్‌శ్రీనివాస్, పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులచే ప్రదర్శించిన పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పోలను ఆశక్తిగా తిలకించారు. అనంతరం ఎంపీ తంగెళ్ళ ఉదయ్ గెలుపొందిన విజేతలకు మెమెంటో, సర్టిఫికెట్లు పాటు నగదు బహుమతులు అందజేశారు. మొట్టమొదటిగా నిలిచిన ప్రాజెక్ట్‌లకు రూ.50 వేలు నగదు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ఆధునిక సమాజంలో టెక్నాలజీ రోజు రోజుకూ దూకుసుపోతుందని, దానికి తగినట్లుగా ఇంజనీరింగ్ విద్యలో మార్పులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి, కళాశాల ఛైర్మన్ బుర్రా అనుబాబు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బుర్రా అనురాధ, డైరెక్టర్ బుర్రా అఖిలేష్, డిప్లొమా ప్రిన్సిపల్ డాక్టర్ వైవిఎన్.రాజశేఖర్, డీన్ డాక్టర్ ఎస్.కొండలరావు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

నగదు బహుమతి మెగా చెక్‌ను అందజేస్తున్న ఎంపి ఉదయ్‌శ్రీనివాస్

కఠిన చర్యలు తప్పవు : సిఐ

ప్రజాశక్తి - గొల్లప్రోలు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిఐ జి.శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం మండలంలోని చెందుర్తి గ్రామంలో ఇబిసి, ఎస్‌సి ఏరియాలో అసాంఘిక కార్యకలాపాలపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువధ, అక్రమ గ్రావెల్ తవ్వకాలు, జూదాలు వంటి అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని అన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎన్.రామకృష్ణ, గ్రామ పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిఐ శ్రీనివాస్

గోయాజ్ జ్యూయలరీ ప్రారంభం

-సందడి చేసిన సినీతార నేహాశెట్టి

ప్రజాశక్తి - కాకినాడ

గోయాజ్ జ్యూయలరీ షాపు ఘనంగా శనివారం ప్రారంభం అయింది. నగరంలోని సుభాష్ రోడ్ సంస్థ 17వ బ్రాంచ్‌ను సినీతార నేహాశెట్టి జ్యోతి ప్రజ్వలన చేసి షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశంలోనే అతిపెద్ద లగ్జరీ వెండి ఆభరణాల సంస్థగా గోయాజ్ నిలుస్తుందన్నారు. ఇక్కడ కలెక్షన్స్ చాలా బాగున్నాయని, తనకు ఎంతగానో నచ్చాయని అన్నారు. వెండి మరియు వెండి మీద బంగారం జ్యువెలరీ కేటగిరీలో కొత్త నిర్వచనాన్ని సృష్టిస్తున్న గోయాజ్ సంస్థ వేగంగా దక్షిణ భారతదేశ వ్యాప్తంగా విస్తరిస్తోందని వివరించారు. ఆభరణాలు ఎపుడూ మగువలకి అలంకరణ, సంతోషాన్ని ఇస్తున్నాయని, ఎప్పటికప్పుడు కొత్త డిజైన్లు మార్కెట్‌లోకి వస్తూనే ఉంటాయని అన్నారు. సంస్థ అధినేత రవి మాట్లాడుతూ గోయాజ్ వెండి ఆభరణాల వర్గాన్ని ఆకట్టుకోవడంతో పాటు దక్షిణ భారతదేశం అంతటా వేగంగా విస్తరిస్తోందన్నారు. 1500 చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఇది ఎల్లప్పుడూ మీతో పాటు నిలిచి ఉండే షాపింగ్ అనుభవం అని అన్నారు. సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 5 వరకు గొప్ప ప్రారంభ ఆఫర్‌లతో గోయాజ్ మీ ముందుకు వచ్చిందన్నారు. ఈ సందర్భంగా సినీతార నేహాశెట్టిను చూసేందుకు పెద్దఎత్తున యువత ప్రారంభోత్సవ కార్యక్రమానికి హజరయ్యారు. యువతతో ఆమె సెల్ఫీ తీసుకుని సందడి చేశారు.

జ్యోతిప్రజ్వలన చేస్తున్న సినీతార నేహాశెట్టి

యువతతో సెల్ఫీ తీసుకుంటున్న నేహాశెట్టి

కౌన్సిల్‌ను వాయిదా వేయాలని కోరుతున్న కౌన్సిలర్లు

కౌన్సిల్ సమావేశం ఐదు నిమిషాలే..

ప్రజాశక్తి - గొల్లప్రోలు

నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన శనివారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం కేవలం ఐదు నిమిషాలతో మమా అన్పించారు. సమావేశానికి కమిషనర్ కనకారావు, ఎఇ అహ్మద్ అలీషా గైర్హాజరు కావడంతో కౌన్సిల్ సభ్యులు అధికారుల తీరుపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి అధికారులు లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేయాలని కౌన్సిలర్లు గంట అప్పలస్వామి, గుల్ల సుబ్బారావు, మైనం గంగాభవాని మేనేజర్‌ను డిమాండ్ చేశారు దీంతో ఎజెండాలోని ఒక అంశాన్ని ఆమోదిస్తూ సభ వాయిదా వేశారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ గంధం నాగేశ్వరావు, తెడ్లపు అలేఖ్యరాణి, గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, ఇరుగుల యేసు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రోడ్లు, వంతెనలకు మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని ఆర్ అండ్ బి రోడ్లు, వంతెనలకు మరమ్మతులు చేపట్టాలని పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నగరంలోని వంతెనలకు మరమ్మతులు చేయక అధ్వానంగా మారాయన్నారు. టుటౌన్ వంతెన రైలింగ్ పూర్తిగా పుచ్చిపోయిందని, జగన్నాథపురం ఎన్‌టిఆర్ వంతెన దుస్థితి అదేరీతిలో ఉందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు.

ఓటర్ జాబితాపై కసరత్తు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల రెవెన్యూ సిబ్బంది గత కొద్దిరోజులుగా ఓట్లు జాబితాపై కసరత్తు చేస్తున్నారు. 2002 ఓటర్ లిస్ట్, 2025 ఓటర్ లిస్ట్ పోల్చి పరిశీలన చేస్తున్నారు. తగ్గిన ఓటర్లను లిస్టు అవుట్ చేస్తున్నారు. 2002 లిస్టులో చాలామంది చనిపోయి ఉండడం, కొందరు వేరే ప్రాంతాలకు తరలి వెళ్లడంతో రెండు లిస్టులు టాలీ కాక రెవెన్యూ సిబ్బంది కుస్తీలు పడుతున్నారు.

వేలంకలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోని వేలంక గ్రామంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని తెలుగు యువత మండల అధ్యక్షుడు గండే కాశీ ప్రారంభించారు. ఈ శిబిరంలో కాకినాడ వాసన్ ఐ కేర్ వైద్యులు, సిబ్బంది వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఇంటి చెల్లారావు, బేతాళ నారాయణమూర్తి, బేతాళ వీరబాబు,గండే చెల్లారావు, వాసన్ ఐ కేర్ మేనేజర్ పి.స్వామి వందనం, డాక్టర్ రమేష్, టెక్నీషియన్ సాగర్, పిఆర్ఒ నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ధరల వాత..ఛార్జీల మోత...!

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

దసరా పండుగ వేళ ధరల వాత, ప్రయాణ ఛార్జీల మోతతో కలవరం నెలకొంది. తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలను పండుగలు అద్దం పడుతుంటాయి. ప్రతి ఇంటిలోనూ చిన్నారుల కేరింతలు, బంధువుల సందళ్లతో పండుగ సంబరాలు మిన్నంటుతాయి. అయితే ప్రస్తుతం ఈ వేడుకలు సామాన్యులకు దూరం అవుతున్నాయి. కేవలం సంపన్న కుటుంబాలకు మాత్రమే పరిమితం అయ్యే పరిస్థితి నెలకొంది. పెరుగుతున్న ఖర్చుల నేపథ్యంలో కొన్ని కుటుంబాలు తప్పని సరి పరిస్థితులలో బంధువులను ఆహ్వానించగా మరి కొన్ని కుటుంబాలు తమ ఇంట్లోనే పండుగ నిర్వహించుకుని మమ అనిపించక తప్పడం లేదు. ప్రజలకు అవసరమైన నిత్యావసర సరుకుల ధరలు గణనీయంగా పెరిగిన విషయం విధితమే. జిఎస్‌టి శ్లాబు ధరల తగ్గింపు మేడిపండు చందంలా మారింది. దీంతో కొనుగోలుదారులతో పాటు వ్యాపారులు సైతం నివ్వెరపోతున్నారు. మరోవైపు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆర్‌టిసి ప్రత్యేక సర్వీసులకు మంగళం పలికింది. దీంతో ప్రయాణీకుల జేబులకు చిల్లు పడుతోంది. నలుగురు సభ్యులు ఉన్న ఓ కుటుంబం హైద్రాబాద్ నుంచి ఇక్కడకు వచ్చి తిరిగి వెళ్లాలంటేరూ రూ.10 వేలు పై మాటే. దీంతో సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి.

గోదావర్రీ

గోదావరి వరదలు పరివాహక ప్రజల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. జులై, అగస్టు నెలల్లో పలు మార్లు వరద ఉధృతి పెరిగిన విషయం విధితమే. తాజాగా మరోసారి వరద ఉధృతి పెరగటంతో లంక గ్రామాల ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గత కొన్ని రోజులుగా ఎగువ రాష్ట్రాలలో కురుస్తున్న వర్షాలతో పాటు జిల్లాలోనూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరద ఉధృతి క్రమ క్రమంగా పెరుగుతోంది. అయితే గడిచిన పది రోజులలో తగ్గుతూ.. పెరుగుతూ దోబూచులాడుతోంది. తాజాగా ధవళేశ్వరం లోని సర్ ఆర్ధర్ కాటన్ బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక ప్రకటించే అవకాశాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాలలోని లంక గ్రామాల్లో నివసించే ప్రజలు బిక్కు బిక్కు మంటూ జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికే కొన్ని లంకల్లో ప్రజలు అప్రమత్తం కావాలని

అధికారులు హెచ్చరిస్తున్నారు. వరదల నేపథ్యంలో త్వరితగతిన పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి, పూర్తి స్థాయిలో సౌకర్యాలు, వసతులు కల్పించాలని ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వరద బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పాలకుల ప్రచార ఆర్భాటం

పాలకుల ప్రచార ఆర్భాటానికి డిఎస్‌సి విజేతలకు నియామక పత్రాల పంపిణీ దర్పణం పట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకివచ్చిన తర్వాత ప్రకటించిన తొలి డిఎస్‌సికి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. అయితే ఫలితాల అనంతరం కొలువుల సాధించిన ఉపాధ్యాయులు ప్రస్తుతం శిక్షణలో ఉన్నారు. నియామక పత్రాల పంపిణీకి ప్రకటించిన తేదీలను సైతం మార్పులు చేయటతో అభ్యర్థులు ఒకింత నిరుత్సాహానికి గురయ్యారు. అయితే రోజుల వ్యవధిలోనే వారిని విజయవాడకు పిలిపించి నియామక పత్రాలు అందజేయటంతో కొంత ఊరట లభించింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర కేంద్రానికి పిలిచి నియామక పత్రాలు అందజేయటం రాజకీయ రంగు తేటతెల్లమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రతి ఏటా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేస్తామంటూ విద్యాశాఖ మంత్రి లోకేష్ చేసిన ప్రకటన నిరుద్యోగులలో ఉత్సాహాన్ని నింపింది. అయితే ఈ హామీని ఏ మేరకు ఆచరణలో అమలు చేస్తారో వేచి చూడాల్సి ఉంది.

పని గంటల పెంపుదలపై ఆగ్రహం

కార్మికులు, ఉద్యోగుల పని గంటలను పెంపుదలపై ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఇప్పటి వరకూ ఉన్న 8 గంటల నుంచి 10 గంటలకు పెంచడం కూటమి ప్రభుత్వ కార్మికులు, ఉద్యోగుల పట్ల చిన్నచూపును తేటతెల్లం చేసింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాల సవరణపై దేశ వ్యాప్తంగా నిర్వహించిన ఆందోళనలు మిన్నంటిన విషయం విధితమే అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అదే బాటలో నిర్ణయాలు చేయటం విమర్శలకు దారి తీసింది. ఇప్పటికైనా పునరాలోచించి ఉపసంహరించుకోకపోతే కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదు.

నేరాలు ఘోరాలు

గోదావరిలో ఇద్దరు గల్లంతు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పుష్కర్ ఘాటులో శనివారం సాయంత్రం ఇద్దరు గల్లంతయ్యారు. శ్రీరాంపురానికి చెందిన రాయుడు వీరబాబు, రాజమహేంద్రవరానికి చెందిన గుబ్బల బాపిరాజు స్నానం చేసేందుకు పుష్కర్ ఘాట్‌కు వెళ్లారు. బాపిరాజు భవాని దీక్షలో ఉండడంతో స్నానం చేసేందుకు రాగా అతనితోపాటు బాపిరాజు వచ్చాడు. గోదావరి వరద ఉధతి అధికంగా ఉండడంతో స్నానానికి దిగిన ఇద్దరూ గల్లంతయ్యారు. సమాచారం తెలిసిన వెంటనే త్రీ టౌన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఫలితం లేకపోవడంతో ఆదివారం గాలింపు చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు. పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గల్లంతైన వారి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. గల్లంతైన వారి ఆచూకీ లభించేంత వరకు పుష్కర్ ఘాట్‌లోనే ఉంటాం అనడంతో పోలీసులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలం మురారి జాతీయ రహదారిపై మోటార్ సైకిల్‌పై వెళుతున్న ఒక వ్యక్తిని జగ్గంపేట వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గండేపల్లి గ్రామానికి చెందిన బోసనకూరి రంగబాబు(40) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థానానికి చేరుకున్న అతనని జిఎస్ఎల్‌కు తరలించారు. స్థానిక ఎస్ఐ శివనాగు నెంబర్ బోర్డు ద్వారా కారుని వెంబడించడంతో ఆచూకీ లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్ట్ మార్టం నిమిత్తం అతని మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్ట్

ప్రజాశక్తి - సామర్లకోట

భీమేశ్వరాలయంలో దర్శనానికి వెళుతున్న దంపతులను బెదిరించి మొబైల్ ఫోన్ లాక్కొని పారిపోయిన దొంగను పోలీసులు కేవలం 12 గంటల్లోనే అరెస్టు చేశారు. సామర్లకోట సిఐ ఎ.కృష్ణ భగవాన్ తెలిపిన వివరాల ప్రకారం...జగనన్న కాలనీలోకి చెందిన శివాజీ, అతని భార్య పద్మ శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఆలయానికి వెళుతుండగా, స్థానిక గాంధీ బొమ్మ వద్ద పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు గ్రామానికి చెందిన మేకల రాము సిమెంట్ ఇటుకతో బెదిరించి, శివాజీ జేబులో ఉన్న మొబైల్ ఫోన్ లాక్కొని రైల్వే స్టేషన్ వైపు పారిపోయాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి సిసి కెమెరాల ఆధారంగా దొంగను గుర్తించారు. సాయంత్రం 6 గంటల సమయంలో కాకినాడ రోడ్డులోని ఐదు తూముల వద్ద అతనిని అరెస్టు చేసి, ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

దొంగతనం కేసులో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ట్రాక్టర్ బేరింగ్‌ల దొంగతనం కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సిహెచ్.రాజేష్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి వివరాలను ఆయన వెల్లడించారు. ఎన్.కొత్తపల్లికి చెందిన కోడూరు సుబ్బారావు గ్రామంలో ట్రాక్టర్ స్పేర్‌పార్ట్స్ వ్యాపారం చేస్తూ ఇంటిని గ్రామానికి చెందిన వాతాడ వెంకటేశ్వరరావుకు అప్పగించి సుబ్బారావు హైదరాబాదులో ఉంటున్నాడు. ఈ నెల 21న స్పేర్ పార్ట్స్ ఉన్న ఇంటి తలుపులు పగలగొట్టి ఉండడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. రూ.36 వేలు విలువచేసే 60 ట్రాక్టర్ బేరింగ్‌లు దొంగతనం జరిగినట్లు గుర్తించి వెంకటేశ్వరరావు తమకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపినట్లు తెలిపారు. శనివారం ఎన్.కొత్తపల్లిలో దొంగతనానికి గురైన 60 బేరింగ్‌లతో ఆటోలో వెళుతున్న యలమంచిలి శివరావు, లంకే బ్రహ్మాజీ, ఆదివారపుపేట గణపతిలను పట్టుకుని ఆటో సీజ్ చేసి నిందితులను అరెస్టు చేసి అమలాపురం కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - నల్లజర్ల

నడిచి వెళుతున్న భవాని మాలదారులను బైకు ఢీకొన్న సంఘటనలో వాహనచోదకుడు తానం ప్రేమ్ కుమార్ (23) తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ధూబచర్ల సర్వీసు రోడ్డులో ఇటుకల బట్టీ సమీపంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. కాకినాడ జిల్లా కొత్త ఇసుకపల్లి గ్రామానికి చెందిన 13 మంది భవానీ మాలదారులు విజయవాడ దుర్గ గుడికి కాలినడకన వెళుతుండగా మండలంలోని గంటావారిగూడెంకు చెందిన ప్రేమ్ కుమార్ వీరిని వెనుక నుంచి ఢీ కొట్టాడు. కొత్త ఇసుకపల్లి గ్రామానికి చెందిన భవాని మాలదారుడు పెంకె లోవరాజుకు కాలు విరగ్గా, ప్రేమ్‌కుమార్ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శోభనాద్రి తెలిపారు.

వల్లభునికి రూ.4.78 లక్షల ఆదాయం

ప్రజాశక్తి -పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో ఉన్న శృంగారవల్లభ స్వామి దేవస్థానానికి శనివారం ఒకరోజు రూ.4.78 లక్షల ఆదాయం సమకూరింది. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.2,47,140, అన్నదాన విరాళాల ద్వారా రూ.1,97,648, కేశఖండన ద్వారా రూ.7,080, తులాభారం ద్వారా రూ.750, లడ్డు ప్రసాదం ద్వారా రూ.25,365 మొత్తం రూ.4,77,983 వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్య నిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమా చార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దాతకు చిత్రపటాన్ని అందిస్తున్న ఇఒ

అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

వల్లభ స్వామి దేవస్థానం అన్నదాన ట్రస్ట్‌కు కాకినాడ రమణయ్యపేట చెందిన వి.జోగిరాజు, సూర్యలక్ష్మి దంపతులు రూ.1,25,001 విరాళాన్ని అందజేశారు. కార్యనిర్వాహనాధికారి వడ్డి శ్రీనివాసరావు దాతకు స్వామి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేసి సత్కరించారు.

వెంకటరెడ్డిపై చర్యలు కోరుతూ ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

డిఎల్‌పిఒ కార్యాలయ ఎఒ సిహెచ్.వెంకట్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత, బహుజన ప్రజా సంఘాలు శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ గత కొన్ని ఏళ్లుగా క్రింది స్థాయి ఉద్యోగులపై వేధింపులకి పాల్పడుతూ మానసిక ధైర్యాన్ని దెబ్బతీస్తున్నారని అన్నారు. కొంతమంది దళారులతో కింది స్థాయి అధికారులపై ఫిర్యాదులు చేయించి ఆ ఫిర్యాదులు నేపథ్యంలో తన వద్దకు వచ్చిన పిటిషన్ ఆధారంగా వారిని బెదిరించి బేరసారాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు చెందిన ఉద్యోగులపై ఈ వేధింపులు అధికమయ్యాయని అన్నారు. కొత్తపల్లి మండలం పొన్నాడ గ్రామ పంచాయతీ కార్యదర్శిపై ఎఒ 150 సార్లకు పైగా ఫిర్యాదులు చేయించారన్నారు. కొన్ని సందర్భాల్లో మహిళా ఉద్యోగులను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడని వారు ఆరోపించారు. తక్షణమే అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

బాటసారులకు తాగునీటి సదుపాయం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక శెట్టిబలిజిపేట శివారు పొలాల్లో ఉన్న ధన సత్తెమ్మ ఆలయం వద్ద బాటసారుల కోసం ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌ను టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్‌విఎస్ అప్పలరాజు శనివారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన కిల్లి భవానీశంకర్ ఆర్థిక సాయంతో ఈ వాటర్ ట్యాంక్ నిర్మించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దేవరపల్లి మూర్తి, వైబోగుల కొండబాబు, పంచాయితీ కార్యదర్శి జి.శివ, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కాట్రావులపల్లి కనక దుర్గమ్మతల్లి ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్, టిడిపి నాయకులు ముసిరెడ్డి నాగేశ్వరావు, జనసేన నాయకులు అధ్యక్షులు సుంకర శ్రీనివాస్, అడబాల వీరబాబు, మాదారపు వీరబాబు, రమేష్, పాలెం బాబీ పాల్గొన్నారు.

తాగునీటి కుళాయిని ప్రారంభిస్తున్న అప్పలరాజు

సచివాలయ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - గండేపల్లి, పెద్దాపురం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సచివాలయం ఉద్యోగులు రాజ్యాంగ నిర్మత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాలకు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.జాన్ క్రిస్టోఫర్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రతిసారీ ఇంటింటికి తిరిగి విధులు నిర్వహించడం, క్షేత్రస్థాయిలో తీవ్ర అవమానాలకు గురికావాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.ప్రసాద్, సిహెచ్.రాజేష్, ఎన్.నాగమణి, ఎండి కరీం, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లిలో వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

పెద్దాపురం మండలంలోని పులిమేరు సచివాలయ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి గాంధీ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే విధంగా చూడాలని వారికి విన్నవించారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

లయన్స్ క్లబ్ చేయూత

ప్రజాశక్తి - సామర్లకోట

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా బలుసులుపేటలో ఇల్లు కూలిపోయిన బాధిత కుటుంబానికి లయన్స్ క్లబ్ అండగా నిలిచింది. శనివారం లయన్స్ క్లబ్ అధ్యక్షులు అమలకంటి శ్రీనివాస్, జిల్లా ఛైర్మన్ చిత్తలూరి వీర్రాజు ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు, దుస్తులు, ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నేతల హరిబాబు, లయన్స్ ప్రతినిధులు మాజేటి కృష్ణ, ఏలేటి రమేష్, వేగు సత్తిబాబు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నిత్యవసరాలు అందిస్తున్న క్లబ్ సభ్యులు

శిక్షణలో పాల్గొన్న అధికారులు, కార్యదర్శులు

ఓఎస్ఆర్‌పై అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి - కరప

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పెంకె శ్రీలక్ష్మి అధ్యక్షతన ఓన్ సోర్స్ రెవెన్యూపై శిక్షణ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ సలాది శ్రీనివాసరావు ఒఎస్ఆర్, ఆదాయ వనరులు, పన్నులు, పన్నేతర అంశాలపై శిక్షణ ఇచ్చారు. వినూత్న ప్రాజెక్టుల ఏర్పాటుకు నిధుల సమీకరణ మార్గాలు, గ్రామ పంచాయతీల సుస్థిర వనరుల కల్పన కొరకు ఈ శిక్షణ ఎంతో దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ నరసింహం, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని పంచాయితీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు 2 రోజులపాటు నిర్వహించిన శిక్షణ తరగతులు ముగిశాయి. రెండో రోజైన శనివారం జరిగిన శిక్షణలో గ్రామాల అభివృద్ధి కోసం అనుసరించాల్సిన అంశాలపై ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్ వివరించారు.

హైవే రోడ్డులో బస్సుల పార్కింగ్

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఇటీవల కాలంలో జాతీయ రహదారి 216 పై ప్రమాదాలు తరచూ జరుగుతున్నా, వాహనదారులు నిబంధనలు పాటించడం లేదు. స్థానిక జై భీమ్ పేట సెంటర్, ఇరిగేషన్ కార్యాలయం ఎదురుగా ప్రతిరోజు హైవే రోడ్డు రెండు వైపులా ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులు పార్కింగ్ చేస్తున్నారు. భారీ వాహనాలు వచ్చినప్పుడు ప్రయాణికులు తప్పించుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ బస్సుల వల్ల అనుకోని ప్రమాదం జరిగితే దీనికి ఎవరు బాధ్యులు అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

రహదారి పక్కనే నిలిపిని ప్రయివేటు బస్సులు

ఇప్పటికైనా హైవే సేఫ్టీ అధికారులు, రోడ్ సేఫ్టీ పోలీసులు స్పందించి ఆ బస్సులను అక్కడ పార్కింగ్ చేయకుండా నిరోధించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కరప

మండలంలోని జడ్.భావారంలో స్థానిక నాయకుల శాఖ వంశీ, బుంగ బాబి, గున్నం శ్రీను ఆధ్వర్యంలో ఎంఎల్‌హెచ్‌పి కేతిరెడ్డి ఎస్తేరురాణి పర్యవేక్షణలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ మేఘన వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురికి శస్త్రచికిత్సలు చేయాల్సివున్నట్లు గుర్తించారు. వారికి త్వరలోనే శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు భోగిరెడ్డి గంగాధర్, బండారు మురళీ, కోటగిరి మహేంద్రబాబు, గున్నం ఉదయ్, పుల్లయ్య ప్రసాద్, పలివెల అప్పారావు, గుబ్బల భాస్కరరావు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన గణిశెట్టి గీతా మాధవ్‌కు సిఎం సహాయనిధి నుంచి విడుదలైన రూ.30,541 విలువైన చెక్కును శనివారం ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప అందజేశారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్ పురం గ్రామ టిడిపి అధ్యక్షుడు చల్లా బుజ్జి, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

పేద కుటుంబాన్ని దత్తత తీసుకుంటున్న శ్రీనివాస్

పి-4లో నిరుపేద కుటుంబం దత్తత

ప్రజాశక్తి - పెద్దాపురం

పి-4 కార్యక్రమంలో ఒక నిరుపేద కుటుంబాన్ని దత్తత తీసుకున్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజా సూరిబాబురాజు ఆధ్వర్యంలో జరిగింది. పట్టాభి ఆగ్రో రైస్ ఇండస్ట్రీ అధినేత శ్రీనివాస్ కుటుంబాన్ని దత్తత తీసుకొని ఆర్థిక, సామాజికంగా తోడ్పాటు అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పి-4 కార్యక్రమం పేద కుటుంబాలకు అండగా నిలిచే విధంగా కొనసాగుతోందన్నారు.

సూపర్ సేవింగ్‌పై ప్రచారం

ప్రజాశక్తి - కరప

జిఎస్‌టి తగ్గింపుతో శనివారం కరప గ్రామంలో ప్రచారం నిర్వహించారు. షాపుల యజమానుల వద్దకు వెళ్లి వినియోగదారులకు, షాపు యజమానులకు జిఎస్‌టి తగ్గింపుతో కలిగే ప్రయోజనాలను వివరించినట్లు ఎంపిడిఒ సలాది వెంకట శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నిర్మలాదేవి పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న వైసిపి లీగల్ సెల్ న్యాయవాదులు

వైద్య విద్యను పరిరక్షించాలని నిరసన

ప్రజాశక్తి - కాకినాడ

వైద్య విద్యను పిపిపి విధానంలో నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా వైసిపి లీగల్ సెల్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించిన అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ నాయకులు ఆదిత్యకుమార్, జి.వెంకటేశ్వరరావు, పితాని శ్రీనివాస్, నున్నా వెంకట కృష్ణారావు, గేడం శ్రీనాథ్, బాలాజీ, దుర్గాప్రసాద్, స్వామి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

అవార్డును అందుకుంటున్న సత్య భాస్కర్

మాజేటికి ఉత్తమ రైతు అవార్డు ప్రదానం

ప్రజాశక్తి - యానాం

ప్రముఖ రైతు, వ్యాపారవేత్త, యానాం వర్తకసంఘం గౌరవ అధ్యక్షుడు మాజేటి సత్యభాస్కర్‌కు వరిధాన్యం సాగులో ఉత్తమ రైతు అవార్డును అందుకున్నారు. శుక్రవారం విజయవాడలో ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన వార్షిక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. వరిసాగు పంటల విభాగంలో సత్యభాస్కర్‌కు అవార్డు రావడం పట్ల పలువురు రైతులు, వ్యాపారులు అభినందనలు తెలిపారు.

151 మద్యం బాటిల్స్ స్వాధీనం

ప్రజాశక్తి - యానాం

యానాం బైపాస్ రోడ్డులో ఒక పాన్ షాప్‌లో అనధికారికంగా మద్యాన్ని విక్రయిస్తున్న గొల్లపల్లి రవిని శనివారం యానాం పోలీసులు అరెస్టు చేశారు. అతని షాపులో 151 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు. ఈ దాడుల్లో ఎఎస్ఐలు పట్టాబి, పోషియ్య పాల్గొన్నారు.

ఉద్యమ ఆధార్ ఎంతో అవసరం

ప్రజాశక్తి - కిర్లంపూడి

మహిళలు ఆర్థిక సాధికారత సాధించేందుకు ఉద్యమ ఆధార్ ఎంతోగానో దోహదపడుతుందని ఎపిఎం పి.విజయలక్ష్మి అన్నారు. శనివారం మండల మహిళా సమైక్య కార్యాలయంలో మహిళలకు ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియను ఎపి శరకణం వేదకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్ వల్ల కలిగే ప్రయోజనాలను మహిళలకు వివరించారు. మహిళలు బ్యాంకు రుణాలను తీసుకుని వివిధ వ్యాపారాలు నిర్వహించి, మహిళా ఆర్థిక సాధికారత సాధించడమే కాకుండా, మహిళా వ్యాపారవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్, ఎస్.సత్య, సిసిలు బుల్లియ్య, లోవరాజు, విఒఎలు పాల్గొన్నారు.

ముద్రగడను కలిసిన మాజీ ఎస్‌పి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

కిర్లంపూడిలో మాజీ మంత్రి, వైసిపి పిఎసి సభ్యులు ముద్రగడ పద్మనాభంను మాజీ ఎస్‌పి పిట్టా సోమశేఖర్ శనివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ముద్రగడ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చల్లా ప్రభాకర్, గౌతు స్వామి పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక సాంబమూర్తి నగర్‌లో వివేక వర్ధిని బాధ్యులు మానస అధ్యక్షతన 3 రోజులు పాటు నిర్వహించిన మెడిటేషన్, వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలను ప్రదానం చేశారు. శిబిరంలో పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌతమ్, కంబాల వీరబాబు, సుధీర్, మానస, చాందిని, ఆజాద్, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒరిజినల్ దస్తావేజు పోయినది

తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు అగ్రహారం గ్రామానికి చెందిన కొండేపర్తి కోట సత్యవతి w/o వీర నాగులు లకు చెందిన ఒరిజినల్ దస్తావేజులు సర్వే(నెం.183-2 యు॥సెం॥47.00) తీసుకుని జిరాక్స్ నిమిత్తం కానూరు సెంటర్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో పడిపోయినది దొరికిన వారు ఈ క్రింది అడ్రస్ కు అందజేయగలరు

కొండేపర్తి కోట సత్యవతి
W/o వీర నాగులు
కానూరు అగ్రహారం గ్రామం
పెరవలి మండలం
తూర్పుగోదావరి జిల్లా
ఫోన్ నెం-8309015061

లింక్ దస్తావేజు పోయినది

వానపల్లి ప్రతీప్ తండ్రి నరసింహామూర్తి డోర్‌నెం.4-71, ఆలమూరు మండలం జొన్నాడ అగ్రహారం కోనసీమ జిల్లాలో నివసిస్తున్న నాయొక్క ఒరిజినల్ లింక్ క్రయ దస్తావేజు **నెం.2034/2012 ది.13-08-2012** ఆలమూరు సబ్‌రిజిస్టర్ ఆఫీసులో రిజిస్టర్ కాబడిన దస్తావేజు **ది.22-09-2025వ** తేదీన బ్యాంక్‌లోన్ నిమిత్తం రాజమండ్రి ప్రకాష్‌నగర్‌లో జిరాక్స్‌కు వెళ్ళుచుండగా ప్రకాష్‌నగర్ రౌండ్‌పార్క్ వద్ద పడిపోయినది. ఎవరికైనా దొరికినయెడల ఈక్రింది ఫోన్ నెంబరుకి తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.

వానపల్లి ప్రతీప్
సెల్ : 9704220242

మహారాజశ్రీ కాకినాడ 6వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టు
O.S. No. 32/2017
Between :
అబ్బిరెడ్డి రామ్‌ప్రకాష్ ...ప్లయింటిఫ్
మరియు
1) పల్లా వరలక్ష్మి (died)
2) పల్లా సత్యారావు (died), **వగైరాలు**
...డిఫెండెంట్లు

D_3 - పల్లా సత్యసంతోష్ కుమార్, S/o. లేటు సత్యారావు, C/o. సురేష్ రెన్డ్ల అపర్ణరెడ్డి, హచ్.నెం.2-6-1049/1, రోడ్ నెం.2, స్ట్రీట్ నెం.6, డెపొడిల్స్ హైస్కూల్ ప్రక్కన, కె.ఎల్.ఎన్.రెడ్డి కోలనీ, వరంగల్, తెలంగాణ స్టేట్.
D_4 - ధౌలూరి యశోద, W/o. కుమార్, ఫ్లాట్ నెం.501, డోర్.నెం.4-59-17/12, శ్రీ సాయి సంపత్ అపార్ట్‌మెంట్స్, లాసన్స్‌బే కోలనీ, విశాఖపట్నం.
D_5 - పల్లా సరితారామణి, W/o. (లేటు) విజయ్, ఉద్యోగస్తురాలు, డోర్.నెం.3-42/3, పంచాయితీ ఆఫీసు ప్రక్కన, జార్జిపేట, నీలపల్లి గ్రామం, తాళ్ళరేవు మండలం, కాకినాడ జిల్లా.

పై దావాలో మీరు D3, D4 మరియు D5 అయ్యివున్నారు. పైన తెలిపిన దావాలో శ్రీ కోర్టు వారి ద్వారా మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. పైన తెలిపిన దావా **ది. 14-10-2025 సం॥** తేదీన వాయిదా అయ్యివున్నది. కావున పై తేదిన, పైన తెలిపిన కోర్టులో హాజరై మీ ఆక్షేవణలు తెలియపరచుకోవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానము చేయబడుననియు ఇందుమూలముగా తెలియజేయడమైనది.
|| By Court Order ||
కాకర వెంకటేశ్వరరావు, అడ్వకేట్
#12-1-40, జవహర్ వీధి, కాకినాడ.
Ph: 0884-2367503, Cell: 9848314081

In the Court of the III Additional Senior Civil Judge Court at Kakinada
E.P. No. 25/2024 in
O.S. No. 103/2020
Between:
Kasina Ravi Kumar
...*DHr/ Plaintiff*
AND
Dayam Madhava Rao
...*JDr/ Defendant*
To:
Dayam Madhava Rao, S/o. (late) Surya Rao, Flat No. F-1, Harsha Residency, Sathish Chandra Nagar, Thimmapuram, Kakinada Rural Mandal, Kakinada District.

పై నెంబరు అమలు గ్రంథములో JDr అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు సేల్ నోటీసులు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 08-10-2025వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై అమలు గ్రంథము మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
N.S.R.N.CHOWDARY
Advocate, Kakinada
Cell: 9848222565

NOTICE
IN THE COURT OF THE III ADLL DISTRICT JUDGE : KAKINADA
O.S.No.217 of 2016,
E.P.No.15/2023
Between:
Koppaka Neelima,
Rep by GPA Holder
Ipperla Tirupatirao ...DHR
and
Tambathula Ravi ..JDR
To,
Tambathula Ravi, S/o. Suryanarayana, Resident of F.C.I. Colony, House No.46, valasapakala, Kakinada Rural Mandal.

Whereas the DHR filed the above Execution Petition against you for sale of Schedule property, The Hon'ble Court ordered Rule 66 notice. The above execution petition is posted to **13-10-2025** for you appearance with your defense if any **at 10.30 A.M.** On the above said date before the Hon'ble Court, failing which the execution petition will be heard and determined exparte.
Schedule Property: East Godavari district, Presently Kakinada District, Kakinada Rural Mandal, Sarpavaram Sub-registry, Vakalapudi Grama Panchayat, Vakalapudi Village, 326.66 sq.yards of site in plot no.35, in L.P.No.110-85 in S.No.205, out of Ac. 9-94 cents within the following boundaries. **East:** 60-00 feet - 40 feet Road. **West:** 60-00 feet - Plot No.34 site. **North:** 49-00 feet -plot no.32 site. **South:** 49-00 feet - 33 feet road. Within the above boundaries with all easement rights etc.
(By order of the Hon'ble Court)
P. RAJESH BABU, Advocate
Gandhinagar, Vaniplaza apartment, Kakinada, Cell: 9440473663

IN THE COURT OF CHIEF JUDGE - CUM-MACT, CITY CIVIL COURTS.
At: Chatta Bazar, Hyderabad.
MVOP No. 631 of2024
BETWEEN:
Ramu Gottimukkula,
...Petitioner / s.
AND
Sree Srinivasa Travels, & Anothers.
...Respondent/s.
To,
Kumara Swamy Padarapaka, @Kumar Swamy Padarapaka, S/o:Govinda Raju, @Govindaraju (Late), Age:52 years, Occ: Driver, R/o:H.No:4-77, Lingamparthy, Yeleswaram(M), East Godavari-533429. Ph.No:8074664714
Take this Notice that the petitioner herein has filed the above M.V.O.P. against you and another respondent by claiming compensation before the above mentioned Court. Hence the above M.V.O.P. is posted for your appearance and counter. If you fail to appear before the above mentioned Court on **28-11-2025** by **10.30** a.m., the matter will be decided in your absence.
(By Order of the Court)
PUTTA THIRUPATHI REDDY
(AP/52/1996) MA (Eco), LLM (Con)
ADVOCATE
Flat No: 1, Ravi Residency Apartment, H.No:13-4-48/F/1, Opp:Central Bank of India, left side to Rajadhani Theater, Vikas Nagar, Dilsukh Nagar, Hydrabad (Town & Dist.) Telangana (State), PIN:500060. Phone: 9440687160.
Mail id: putta.thirupathireddy@gmail.com